

• **చింత చిగురు @ 700**

హైదరాబాద్ మార్కెట్‌లో ప్రస్తుతం చింతచిగురు రేటు ప్రియంగా మారింది. కేజీ రూ. 700 వరకు పలుకుతున్నది. దీంతో గ్రామీణ ప్రాంతం నుంచి చింత చిగురు తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. మహబూబ్‌బాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామ శివారులో ఓ మహిళ ఇలా చింత చెట్టెక్కి చిగురు తెంపుతూ కనిపించింది.

**-నాల్లం రఘుపతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌బాద్ జిల్లా**



**మానేరులో నా(నీ)టి కళేది..?**

ఈ ఏడాది జనవరి దాకా నిండుకుండలా ఉన్న కరీంనగర్‌లోని మానేరు రిజర్వాయర్, కొద్దిరోజులుగా నిండుకుంటున్నది. వర్షాభావ పరిస్థితులు, కాళేశ్వరం ప్రాజెక్టులో నీరు కిందికి వదలటం వెరసి మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలకు నీటి తరలింపు ప్రక్రియ నిలిచింది. దీంతో, ఎల్‌ఎండీలో నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో రాబోయే రోజుల్లో నగరవాసులకు తాగునీరందించటం ఇబ్బందికరంగా మారనున్నది.

**- బాలు, ఫొటోగ్రాఫర్ కరీంనగర్**

# నీళ్లున్నా.. నల్లారాదు!

## కృష్ణా జలాలు ఫుల్.. సరఫరా నిల్..

- ఎల్లూరులో పూర్తి స్థాయిలో నీటినిల్వలు
- మరమ్మతుల పేరుతో అధికారుల సాకులు
- ముందుచూపులేని కాంగ్రెస్‌తో కొరత
- గ్రామాల్లో తాగునీటి సమస్య జఠిలం



కొల్లాపూర్ సమీపంలో నీటితో నిండుగా ఉన్న ఎల్లూరు రిజర్వాయర్

కొల్లాపూర్ రూరల్, మే 20 : కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం లక్ష్యం నీరుగారుతున్నది. కాంగ్రెస్ పాలనలో పల్లెలకు మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. కృష్ణా నది నుంచి ఎత్తి పోసిన నీళ్లు కొల్లాపూర్ సమీపంలోని ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఫుల్‌గా ఉన్నా.. నీటి సరఫరాలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ రావడంతోనే కరువుతోపాటు తాగునీటికీ కృత్రిమ కొరత తెచ్చి పెట్టిందని ప్రజలు వాపోతున్నారు.

### శ్రీశైలంలో 807.60 అడుగులు

కృష్ణానదిలో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరింది. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 807.60 అడుగుల మేర నిల్వ ఉన్నాయి. శ్రీశైలంలో 800 అడుగుల మేర నీళ్లున్నా నల్లమలలోని రేగుమాన్‌గడ్డ నుంచి ఓపెన్ కెనాల్ ద్వారా మిషన్ భగీరథకు నీళ్లు అందేలా కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోయినా తాగునీటికి ఇబ్బందులు తలెత్త వద్దని కృష్ణానది నుంచి నీటిని తీసుకునే వెసులుబాటు ఉన్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో నీటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలం అవుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయి. కృష్ణానదికి, మిషన్ భగీరథ ప్రధాన ప్లాంట్‌కు కూతవేటు దూరంలో ఉన్న సోమశిల, నార్లాపూర్, చెంచు పెంటలు, గిరిజన తండాలకు కూడా తాగునీరు అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పెంట్లవెల్లి మండలం యంగంపల్లి తండాలో తాగునీటి కోసం వాటర్ ట్యాకర్ వద్ద పలువురు మహిళలు ఘర్షణ పడగా దాదాపు 10 మందికి గాయాలయ్యాయి. ఇలా నీటి కోసం రోడ్లపైకి వచ్చిన ఆడపడుచులు గొడవ పడుతున్న సంఘటనలు కోకొల్లలు.

### 4,500 గ్రామాలకు మిషన్ భగీరథ

కొల్లాపూర్ సమీపంలోని ఎల్లూరు రిజర్వాయర్ నీటి ఆధారంగా మిషన్ భగీరథ ద్వారా పలు గ్రామాలకు నీరు సరఫరా అవుతున్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు కూడా ఇక్కడి నుంచి శుద్ధజలాలు అందుతున్నాయి. మొత్తం 4,500 గ్రామాలకు భగీరథ నీరు చేరుతున్నది. ఉమ్మడి పాలమూరు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు సంబంధించి 13 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (డబ్ల్యూటీపీ) ఏర్పాటు చేశారు. 740 ఎంఎల్ రా వాటర్ ఈ కేంద్రాలకు సరఫరా అవుతోన్నది. కొల్లాపూర్ నియోజకవర్గమంతా రోజుకు 30 ఎంఎల్ (ఒక ఎంఎల్ పది లక్షల లీటర్ల నీటితో సమానం) సరఫరా జరుగుతున్నది. కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో 691 ఆవాసాలకు నీరు చేరుతున్నది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం సగం గ్రామాలకు కూడా తాగునీరు సరఫరా కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే మిషన్ భగీరథ అధికారులు మాత్రం పూర్తిస్థాయిలో నీటిని అందిస్తున్నామని చెబుతున్నా.. అందులో వాస్తవం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



కొల్లాపూర్ మండలం ఎల్లూరు రిజర్వాయర్ సమీపంలో మిషన్ భగీరథ ప్లాంట్



పెంట్లవెల్లి మండలం యంగంపల్లి తండాలో తాగునీటి కోసం వాటర్ ట్యాంకర్ వద్ద మహిళల గొడవ

### వంతుల వారీగా బిందెలు



మా ఊరు కృష్ణానదికి.. ఎల్లూరు రిజర్వాయర్ వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్లాంట్‌కు కూత వేటు దూరంలో ఉన్నది. గతంలో ఎప్పుడూ నీళ్లు వచ్చేవి. కానీ నేడు తాగునీటి కోసం ప్రజలు తండ్లాడుతున్నారు. నల్లాల వద్ద బిందెలను వంతులు పెట్టుకొని పస్తులు ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే నీటి కష్టాలు మొదలై గోస పడుతున్నాం.

**- చిట్టెమ్మ, నార్లాపూర్ మాజీ సర్పంచ్**

### లీకేజీలతోనే సమస్యలు

కొన్ని గ్రామాల్లో లీకేజీ సమస్యల మూలంగా భగీరథ పథకం ద్వారా తాగునీటిని సక్రమంగా అందించలేకపోతున్నాం. ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు చేపట్టే క్రమంలో చాలా చోట్ల మిషన్ భగీరథ పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులకు అలైన్‌మెంట్ ఇవ్వాలని చాలా సార్లు లేఖలు పంపినా స్పందన లేదు. వారు వివరాలు అందిస్తేనే గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.

**- వెంకటేశ్వర్‌రావు, మిషన్ భగీరథ డీఈ**

## విద్యా - ఉద్యోగ సమాచారం

### ఇగ్నోలో జూలై సెషన్ ప్రవేశాలు షురూ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో(ఇగ్నో) జూలై సెషన్ (2024 సంవత్సర) అడ్మిషన్లు షురూ అయ్యాయి. డిగ్రీ, పీజీ, సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ సర్టిఫికెట్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ బీ రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు జూన్ 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ అవకాశమిచ్చామని చెప్పారు. వివరాల కోసం www.ignou.ac.in వెబ్‌సైట్ లేదా 94924 51812, 040 -23117550 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### 23 వరకు లాసెట్ దరఖాస్తుల గడువు

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్‌లాసెట్ దరఖాస్తుల గడువును అధికారులు మరోసారి పొడిగించారు. రూ. 2వేల ఆలస్య రుసుముతో ఈ నెల 23వరకు అవకాశమిచ్చినట్టు లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

### ఎడ్‌సెట్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): రెండేండ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్‌ఎడ్‌సెట్ హాల్‌టికెట్లను మహాత్మాగాంధీ వర్సిటీ అధికారులు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అభ్యర్థులు https://edcet.tsche.ac.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండో సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు.

### టెట్ ఇంగ్లిష్ కాస్త కఠినం

**తొలిరోజు పరీక్షకు 77శాతం మంది హాజరు**

హైదరాబాద్, మే 20(నమస్తే తెలంగాణ): టెట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు పేపర్ -2 గణితం, సైన్స్ పేపర్లను ఆన్‌లైన్‌లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించారు. 34,436 మందికి గానూ 26,796(77.81శాతం) మంది హాజరయ్యారు. ఇంగ్లిష్ ప్రశ్నలు కాస్త కఠినంగా రావడంతో అభ్యర్థులు ఇబ్బందిపడ్డారు. కొత్త పాఠ్యపుస్తకాల నుంచే ప్రశ్నలిచ్చారు. తెలుగులో వ్యాకరణం, కవులపై ఎక్కువ రాగా, సైకాలజీలో సాధారణంగానే ఇచ్చారు. అన్ని తరగతుల్లోని గణితం, సైన్స్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలిచ్చారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం హైదరాబాద్‌లోని ఇన్నోవిజన్ టెక్నాలజీ సెంటర్‌ను తనిఖీ చేసినట్టు టెట్ కన్వీనర్ రాధారెడ్డి పేర్కొన్నారు.

### జోసా తర్వాతే ఎప్‌సెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది జోసా రెండు విడుతల సీట్ల భర్తీ (జూన్ 20) తర్వాతే ఎప్‌సెట్ వెబ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. గతంలో ఎప్‌సెట్ ఫలితాలు విడుదలైన రోజే వెబ్‌కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేశారు. కానీ ఈసారి శనివారం ఫలితాలు విడుదలైనా ఇంతవరకూ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలకాలేదు. దీంతో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఏటా ఎప్‌సెట్ సీట్లను ముందే భర్తీచేయడంతో అందులో చేరిన విద్యార్థులు ఐఐటీల్లో చేరడంతో ఆయా సీట్లు మళ్లీ ఖాళీ అవుతున్నాయి. ఆ సీట్లను కాలేజీలు బ్లాక్‌చేసి, చివర్లో మేనేజ్‌మెంట్‌కోటాలో విక్రయించుకుంటున్నాయి. దీంతో ఎప్‌సెట్ సీట్ల భర్తీని కాస్త ఆలస్యంగా చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

### నేటితో ముగియనున్న వీసీల పదవీకాలం

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని తొమ్మిది వర్సిటీల వైస్‌చాన్స్‌లర్ల పదవీకాలం మంగళవారంతో ముగియనున్నది. ఉస్మానియా, శాతవాహన, కాకతీయ, పాలమూరు, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు తెలుగు, జేఎన్‌ఎఫ్‌ఏయూ, జేఎన్టీయూ, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల వీసీల పదవీకాలం నేటితో పూర్తి కానున్నది. తెలంగాణ వర్సిటీకి ఇప్పటికే ఇన్‌చార్జి వీసీ కొనసాగుతున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రస్తుత వీసీలను కొనసాగించడం లేదా ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా నియమించడానికి అనుమతివ్వాలని కోరుతూ విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనిపై మంగళవారం స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.




టీఎస్‌ఈసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ఆర్ లింబాద్రి తదితరులు

## ఈసెట్ ఫలితాలు విడుదల

- 95 శాతం విద్యార్థులు క్వాలిఫై
- బీఎస్సీ గణితంలో మొండయ్యకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : టీఎస్ ఈసెట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి ఫలితాలను విడుదల చేశారు. పాలిటెక్నిక్, బీఎస్సీ గణితం వంటి కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్, బీఫార్మసీ రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు మొత్తం 11 విభాగాల్లో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 23, 330 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 22,365 (95.86శాతం) మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 25 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నట్టు ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. జూన్ రెండోవారంలో వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఎస్కే మహమూద్, వీ వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఓయూ వీసీ డీ రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ఈసెట్ కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి ఉద్యోగికి మొదటిర్యాంకు

పెద్దపల్లి జిల్లాకు చెందిన మొండయ్య బీఎస్సీ గణితం విభాగంలో 96 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచాడు. ప్రస్తుతం 35 ఏండ్లున్న ఈయన సింగరేణిలో ఉద్యోగి. ఈసెట్‌లో క్వాలిఫై అవుతాననుకున్నా కానీ.. మొదటిర్యాంక్ వస్తుందని ఊహించలేదని తెలిపాడు. బీటెక్ మైనింగ్ ఇంజినీరింగ్ కోర్సులో చేరుతానని చెప్పాడు.

### విభాగాల వారీగా టాపర్లు

| విభాగం | మొదటి ర్యాంకర్ | మార్కులు | జిల్లా |
|---|---|---|---|
| బీఎస్సీ గణితం | యాదగిరి మొండయ్య | 96 | పెద్దపల్లి |
| ఈసీఈ | మేడిశెట్టి నవ్యశ్రీ | 146 | కరీంనగర్ |
| సీఎస్‌ఈ | పీ సాయి ఆశ్రిత్ | 170 | మేడ్చల్ -మల్కాజిగిరి |
| ఈఈఈ | అలువాల గణేశ్ | 140 | జగిత్యాల |
| సివిల్ జీ | సుధాకర్‌రెడ్డి | 166 | మేడ్చల్ -మల్కాజిగిరి |
| మెకానికల్ | కే శ్రీరామ్ | 161 | విశాఖపట్నం |
| ఫార్మసీ | ఎం సాత్విక | 111 | మహబూబ్‌నగర్ |

## రేపటి నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

- స్టైపెండ్ పెండింగ్, ఆలస్యంపై గుర్రు
- ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): డిమాండ్ల సాధనకు బుధవారం నుంచి సమ్మె చేపట్టనున్నట్టు జూనియర్ డాక్టర్లు (జూడా) ప్రకటించారు. ఈ మేరకు జూడా ప్రతినిధులు సోమవారం డీఎంఈ వాణికి నోటీసు అందజేశారు. హౌస్‌సర్జన్లు, పీజీలు, సీనియర్ రెసిడెంట్లకు మార్చి, ఏప్రిల్ నెలల స్టైపెండ్ పెండింగ్ ఉన్నదని, ప్రతి నెలా 20-30 రోజులు ఆలస్యంగా స్టైపెండ్ చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికశాఖ నుంచి రెండుమూడు రోజుల్లోనే స్టైపెండ్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్లకు ప్రతినెల రూ.1.25 లక్షల గౌరవ వేతనం చెల్లిస్తామని ప్రభుత్వం గతంలో ఒప్పుకున్నదని, దీనిని అమలుచేయాలని కోరారు. ఏపీ మెడికల్ కాలేజీల్లో తెలంగాణ విద్యార్థులకు 15 శాతం రిజర్వేషన్ సాధించాలని, ప్రభుత్వ దవాఖానల్లో భద్రతకు భరోసా ఇవ్వాలని, హాస్టళ్లను మెరుగుపరుచాలని, ఉస్మానియా దవాఖానకు కొత్త భవనం నిర్మించాలని, ప్రభుత్వ దవాఖానల్లో వసతులు పెంచాలని నోటీసులో పేర్కొన్నారు. జూడా అధ్యక్షుడు హర్షసాయి మాట్లాడుతూ.. ప్రతినెల 15 వరకు స్టైపెండ్ అందజేస్తామని ఇటీవల వైద్యారోగ్యశాఖ మంత్రి హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు నెరవేరలేదని చెప్పారు. ఏపీలో జీవో 36 ద్వారా రెండు మూడు రోజుల్లోనే స్టైపెండ్ నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. తెలంగాణలోనూ ఇదే తరహాలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని టీచింగ్ దవాఖానల్లో విధులను బహిష్కరించనున్నట్టు వెల్లడించారు. నిరసనల్లో పీజీలు, ఇంటర్న్ స్టూడెంట్లు పాల్గొంటారని చెప్పారు.

## మహిళా అటెండర్‌పై డీఈవో వేధింపులు

- ఆమెతో ఆఫీస్‌లో ఎవరూ మాట్లాడొద్దని హుకుం
- ఆఫీస్ ఎదుట బాధితురాలి నిరసన

మహబూబాబాద్ రూరల్, మే 20: ఓ మహిళా అటెండర్‌ను కొద్దిరోజులుగా డీఈవో మానసికంగా వేధిస్తుండటంతో బాధితురాలు సోమవారం ఆఫీసు ఎదుట నిరసన వ్యక్తం చేసింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. బాధితురాలు పార్వతి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణం ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉంటూ.. 2017 నుంచి మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. గతంలో ఇద్దరు డీఈవోల దగ్గర కూడా పనిచేసింది. అయితే.. ఏడాది కాలంగా విధులు సక్రమంగా నిర్వహించడం లేదంటూ తరచూ డీఈవో రామారావు పార్వతిని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆఫీస్‌లో పని అయిపోయిన తర్వాత కూడా ఫోన్ చేసి కార్యాలయానికి పిలిపించేవాడు. డీఈవో చెప్పిన పని చేస్తేనే జాబ్ రెన్యూవల్ చేస్తానని, లేకపోతే జాబ్ నుంచి తొలగిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. రాత్రి 7.30 గంటల సమయంలో ఫోన్ చేసి ఆఫీస్‌కు పిలిచేవాడని, వచ్చిన తర్వాత ఏ పనీ చెప్పకుండా.. తాను వెళ్లే వరకు ఆఫీస్‌లోనే కూర్చో అని వేధించేవాడు. గత నెల జీతం ఇవ్వకపోగా.. వచ్చే నెల నుంచి ఆఫీస్‌కు రావొద్దని బెదిరించడంతో పాటు ఉద్యోగులందరూ అటెండర్‌తో ఎవరూ మాట్లాడొద్దని హుకుం జారీ చేశాడు. ఆఫీసులో ఆమెకు కేటాయించిన రిజిస్టర్, స్టూల్‌ను కూడా తీసేయడంతో రెండు రోజుల నుంచి కిందనే కూర్చుంటున్నది. డీఈవో వేధింపులకు విసుగు చెందిన పార్వతి ఆఫీస్ ఎదుట నిరసన తెలిపినట్టు వాపోయింది. ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నది.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట బైఠాయించిన బాధితురాలు పార్వతి


## అభ్యసనా సామర్థ్యాలు పెంచడానికే ఆర్పీలకు శిక్షణ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచడానికి, వారిని గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దడానికి రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇస్తున్నట్టు సిమాట్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు డాక్టర్ మల్లయ్య భట్టు, మస్తానయ్య పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రిసోర్స్ పర్సన్లకు మూడు రోజుల సంయుక్త శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలోని రెసిడెన్షియల్ మోడ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణ పొందిన ఆర్పీలు తిరిగి ఆయా రాష్ట్రాల్లోని ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

## నంబర్ ప్లేట్లు.. ఏడు రకాలు

- ఒక్కోరంగుకు ఒక్కో ప్రత్యేకత
- రవాణా సేవల ఆధారంగా రిజిస్ట్రేషన్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): రోజూ మనం చూసే లక్షలాది వాహనాలకు వెనుకాముందు విభిన్న రకాల నంబర్ ప్లేట్లు కనిపిస్తుంటాయి. ఒకదానికి తెలుపు, ఒకదానికి పసుపు.. మరోదానికి ఆకుపచ్చ.. అరుదుగా నలుపు, ఎరుపు, నీలం వర్ణపు ఫలకలు దర్శనమిస్తుంటాయి. ఇలా ప్రత్యేక రంగులో నంబర్ ప్లేటు ఏర్పాటు వెనుక కారణాలు మాత్రం చాలామందికి తెలియవు. ఏరంగు నంబర్ ప్లేటు దేనికి సంకేతం? ఎలాంటి సేవలకు దీనిని వినియోగిస్తారు అనేది చాలా కొద్ది మందికే తెలుస్తుంది. కొందరు తెలియక నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను కిరాయికిచ్చి ఆర్టీఏ అధికారులకు అడ్డంగా బుక్కవుతుంటారు. వాహన రిజిస్ట్రేషన్ సమయంలోనే అవి అందించబోయే సేవలకు చిహ్నంగా ఆయా రంగుల్లో నంబర్‌ప్లేట్లను కేటాయిస్తారు. మన దేశంలో ఏడు రకాల నంబర్ ప్లేట్లు ఉండగా, ఒక్కో కేటగిరీకి ఒక్కో నంబర్ ప్లేట్‌ను ఎలా వినియోగిస్తారో తెలుసుకుందాం..




### నాన్ ట్రాన్స్‌పోర్ట్‌కు గుర్తుగా తెలుపు

తెలుపు రంగు ప్లేటుపై నలుపు రంగు నంబర్ ఉంటే అది నాన్ ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్ అని సూచిస్తుంది.ఇది ఎక్కువ మంది సొంత అవసరాలకు వినియోగించుకునే వాహనాలకు కేటాయిస్తారు. ఇలాంటి నంబర్ ప్లేట్ ఉన్న వాహనాలను కిరాయికి ఇవ్వడం కుదరదు. ఈ వాహనాలను కిరాయికి నడుపుతూ ఆర్టీఏ అధికారులకు పట్టుబడితే సీజ్ చేస్తారు.

### పసుపు రంగు.. ట్రాన్స్‌పోర్ట్‌కు సంకేతం

పసుపు రంగు ప్లేట్‌పై నలుపు రంగులో నంబర్ ఉంటే అది ట్రాన్స్‌పోర్ట్ వాహనమని సంకేతం. ఈ తరహా వాహనాలను కమర్షియల్ అవసరాలకు ఉపయోగిస్తారు. గూడ్స్ సర్వీస్‌కు అనుమతి ఉన్న వాహనాలని అర్థం.

### 'ట్రేడ్'కు పసుపు రంగుపై ఎరుపు నంబర్

పసుపు రంగు ప్లేట్‌పై ఎరుపు రంగులో నంబర్ ఉంటే ఆ వాహనానికి 'ట్రేడ్ సర్టిఫికెట్' ఉందని అర్థం. విక్రయించే కొత్త వాహనాలను తరలించేవాటికి ఇలాంటి నంబర్ ప్లేట్స్ కేటాయిస్తారు.

### ఇలా ఉంటే అద్దెకు..

అద్దె సర్వీస్‌కు అనుమతించిన వాహనాలకు నలుపు రంగు ప్లేట్‌పై పసుపు రంగు నంబర్ ఉంటుంది. వీటిని అద్దెకు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఇలాంటి వాహనాలతో చాలా మంది రెంటల్ సర్వీస్‌ను అందిస్తున్నారు. ఈ వాహనాలు కాకుండా ఇతర వాహనాలను అద్దెకిస్తే ఆర్టీఏ అధికారులు సీజ్ చేస్తారు.

### ఎంబసీ వాహనాలకు బ్లూ ప్లేట్

విదేశీ రాయబార కార్యాలయాల వాహనాలకు మాత్రమే బ్లూ కలర్ నంబర్ ప్లేటు ఉంటుంది. విదేశీ ప్రతినిధులు ఈ బ్లూ నంబర్ ప్లేట్ వాహనాల్లో ప్రయాణిస్తారు. విదేశీ అంబాసిడర్లు, దౌత్యవేత్తల వాహనాలకు ఈ రకం నంబర్ ప్లేట్లు ఉంటాయి.

### ఈవీలకు ఆకుపచ్చ

దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ఆకుపచ్చ నంబర్ ప్లేట్లు కేటాయించారు. ఎలక్ట్రిక్ కార్లు, బైక్‌లకు ఆకుపచ్చ రంగు నంబర్ ప్లేట్‌పై తెలుపు రంగులో నంబర్లు ఉంటాయి. ఇక వాణిజ్య ఎలక్ట్రిక్ వాహనాలకు ఆకుపచ్చ రంగు ప్లేటుపై పసుపు రంగులో నంబర్లు ఉంటాయి.

### గవర్నర్, రాష్ట్రపతి వాహనాలకు ఎరుపు

గవర్నర్, రాష్ట్రపతి వాహనాలకు ఎరుపు రంగు నంబర్ ప్లేట్స్ ఉంటాయి. ఈ నంబర్ ప్లేట్‌లో జాతీయ చిహ్నం అశోక స్తంభం నమూనా ఉంటాయి. నంబర్లు ఉండవు.